డా॥ వై.యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం

# కృషి విజ్ఞాన కేంద్రము - వనిపెంట



# గొర్రెలు మరియు మేకలలో వచ్చే వివిధ వ్యాధులు - నివారణ చర్యలు


డా. టి.విజయ నిర్మల, డా. ఎం.బాలక్రిష్ణ, డా. బి.కాంతి శ్రీ, డా. ఎస్. ఫిరోజ్ హుస్సేన్

డా. బి.గోవిందరాజులు, డా. జె.వి.ప్రసాద్, డా. కె.గోపాల్, డా. షేక్ యన్. మీరా



డా॥ వై.యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం

## కృషి విజ్ఞాన కేంద్రము

కడప -2 (వనిపెంట), మైదుకూరు (మండలం), వై.యస్.ఆర్. కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్.

https://www.kvk-vpt@drysrhu.edu.in https://atari-hyderabad.org.in/





చిటుక రోగం వ్యాధి బారిన పడిన మేక ప్రక్కకి తిరిగి పడుకోవడం
మరియు
లావుగా మరియు మెత్తగా మారిన మూత్ర పిండాలు



మూతి పుండ్ల వ్యాధి బారిన పడిన మేకలో పెదవుల పైన, ముఖం మీద మరియు నాలుక మీద పుండ్లు ఏర్పడటం



మశూచి వ్యాధి బారిన పడిన గొర్రెలో చర్మం, తోక క్రింద మరియు నోటి లోపల పొక్కులు ఏర్పడటం



నీలి నాలుక వ్యాధి బారిన పడిన గొర్రెలో నోటి నోపల చిగుళ్ళ నుండి రక్తం కారటం



కాలి పుండ్ల వ్యాధి బారిన పడిన జీవాలలో పాడై పోయిన  గిట్టలు

# గొర్రెలు మరియు మేకలలో వచ్చే వివిధ వ్యాధులు - నివారణ చర్యలు

గొర్రెల/మేకల పెంపకాన్ని గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు తమ జీవనోపాధి గాను, మరికొందరు తమ ఆర్థిక స్థితిగతులు పెంచుకునేందుకు, ఒక పరిశ్రమ గాను కొనసాగిస్తున్నారు. మన రాష్ట్రంలో మాంసోత్పత్తి పెంచాలి అంటే రైతులు గొర్రెలను మరియు మేకలను సక్రమంగా పోషించాలి. అంటే వాటి ఆరోగ్య పరిరక్షణ చాలా ముఖ్యం. సరైన ఆరోగ్య సంరక్షణ చేపట్టాలంటే సాధారణంగా వచ్చే వ్యాధులు వాటి నివారణ గురించి తెలుసుకోవాలి. గొర్రెలలో మరియు మేకలలో సుక్ష్మాతి సూక్ష్మజీవులు, సూక్ష్మజీవుల మరియు పరాన్న జీవుల వలన వచ్చే ముఖ్యమైన వ్యాధుల గురించి తెలుసుకుందాం.

## సాధారణంగా వచ్చే వ్యాధులు – నివారణ

### పి.పి. ఆర్ (పారుడు వ్యాధి)

ఈ వ్యాధి 'మార్బిలి' జాతికి చెందిన వైరస్ వలన కలుగుతుంది. "ముసర వ్యాధి" లేదా " మేకల ప్లేగు" అని వాడుక భాషలో వ్యవహరిస్తారు. వ్యాధి సోకిన జీవాలతో కలవడం వలన మరియు దగ్గు వలన వచ్చే తుంపర వలన, మలమూత్ర విసర్జికాల వలన ఆరోగ్యవంతమైన జీవాలకు ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన జీవాలలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉండి రైతులు బాగా నష్టపోతారు.

**వ్యాధి లక్షణాలు :**

- జ్వర తీవ్రత $104^{0}$ – $106^{0}$ F వరకూ ఉండి, పెదవులు, చిగుళ్లు, నోరు, నాలుక క్రింద మరియు ఆడ గొర్రెల యోని పెదవుల పైన పొక్కులు ఏర్పడుతాయి.
- దగ్గు విపరీతంగా ఉండి కళ్ళు మరియు ముక్కుల నుండి నీరు కారుతూ ఉంటుంది.
- ఈ నీరు చిక్కపడి చీమిడిగా మారటం వలన ముక్కు రంధ్రాలు మూసుకుపోయి శ్వాస తీసుకోలేక తీవ్ర ఇబ్బందికి గురి అవుతాయి.
- పలుచని రక్తంతో కూడిన విరోచనాలను గమనించవచ్చు.
- మేత మేయకుండా మరియు నెమరు వేయకుండా జీవాలు ఒక చోట ముడుచుకొని ఉండును.
- చూడితో ఉన్న గొర్రెలు మరియు మేకలలో ఈసుకుపోవటం గమనించవచ్చు.

## చికిత్స మరియు నివారణ:

- నాలుగు నెలల నిండిన గొర్రె లేదా మేక పిల్లలకు పి.పి.ఆర్ టీకాను ఇవ్వాలి. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జనవరి మాసంలో ఈ టీకాను గొర్రెలు మరియు మేకలకు ఇవ్వాలి.
- వ్యాధి సోకిన జీవాలను మంద నుండి వేరుచేసి నీరసించి పోకుండా తగిన ఆహారం ఇవ్వాలి.
- పశు వైద్యుని సలహా మేరకు యాంటి బయోటిక్స్ ఇవ్వాలి.
- క్రొత్తగా తెచ్చిన జీవాలకు కొద్ది రోజులు వేరుగా ఉంచి, తరువాత మందలో కలపాలి.

## గాలికుంటు వ్యాధి :

ఈ వ్యాధి "ఆఫ్ థస్" జాతికి చెందిన వైరస్ వలన వస్తుంది. ఈ వైరస్ వలన గొర్రెల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి నడవటానికి ఇబ్బంది పడతాయి. ఈ వ్యాధి గాలి ద్వారా త్వరిత గతిన వ్యాపిస్తుంది. అందుచేత దీనిని 'గాలికుంటు' అని పిలుస్తారు.

## వ్యాధి లక్షణాలు :

- జ్వరం 105$^{0}$ F వరకూ ఉంటుంది.
- నోరు మరియు నాలుక పై పుళ్ళుంటాయి
- నోటి నుండి నురుగు కారుతూ ఉంటుంది.
- జీవాలు మేత మేయలేవు మరియు నెమరు వేయలేవు
- గిట్టలు మెత్తబడి పుండ్లు అవుతాయి
- చూడి జీవాలు ఈసుకుపోతాయి

## చికిత్స :

- నోటి పుండ్లకు బోరిక్ పౌడర్ మరియు గ్లిజరిన్ కలిపి పూయాలి
- కాలి గిట్టల మధ్య పుండ్లను పొటాషియం పెర్మంగానేట్ ద్రావణంతో కడిగి ఈగలు మరియు దోమలు వాలకుండా వేప నూనె లేదా లోరెక్సేన్ అయింట్ మెంట్ పూయాలి.
- వ్యాధి సోకిన తరువాత జీవాలలో వ్యాధి నిరోధక శక్తి తగ్గి సూక్ష్మజీవులు ఆశిస్తాయి. దీని వలన పుండ్లలో చీము ఏర్పడి మిక్కిలి నీరసిస్తాయి.
- ఇది నివారించుటకు పశు వైద్యుని సలహాతో యాంటి బయోటిక్ మందులను వాడుకోవాలి.

### నివారణ :

- మార్చి మరియు సెప్టెంబర్ నెలలలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

### మశూచి వ్యాధి:

గొర్రెలకు మరియు మేకలకు సోకే అంటు వ్యాధుల్లో ఇది చాలా ముఖ్యమైనది. ఈ వ్యాధిని వాడుక భాషలో అమ్మోరు, అమ్మతల్లి మరియు బొబ్బరోగం అని వ్యవహరిస్తుంటారు. ఈ వ్యాధి పాక్స్ (sheep pox) వైరస్ వలన వస్తుంది. ఈ వ్యాధి ఎండాకాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది.

వ్యాధిగ్రస్త జీవాలు ఆరోగ్యవంతమైన జీవాల మందను కలవడం ద్వారా, వ్యాధి కారక సుక్ష్మాతి సుక్ష్మజీవులలో కలుషితమైన మేత, నీరు, గాలి, దాణా మరియు నీటి తొట్టెలు మరియు ఇతర పరికరముల ద్వారా వ్యాధి అతి త్వరగా వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి కారక సుక్ష్మాతి సుక్ష్మజీవులు గొర్రెలు/మేకల శరీరంలోకి ప్రవేశించిన 2 – 14 రోజులోపు వ్యాధి లక్షణాలను గమనించవచ్చు. వ్యాధి తీవ్రతను బట్టి మశూచి వ్యాధిని ప్రాణాంతక రకం మరియు నిరపాయమైన రకాలుగా విభజించవచ్చు.

### ప్రాణాంతక రకం:

- జ్వర తీవ్రత 106° – 107° F వరకు ఉండును.
- పొక్కులు నోటి లోపల మరియు జీర్ణాశయ లోపలి భాగంలో కనపడతాయి.
- కొన్ని జీవాలు పొక్కులు ఏర్పడక ముందే చనిపోతాయి.
- ఈ పొక్కులు ఊపిరితిత్తులలో ఏర్పడి ఊపిరి తీసుకుపోవటం చాలా కష్టమై విపరీతంగా దగ్గుతూ ఉండును.
- ఈ రకము వ్యాధి ఎక్కువగా పిల్లలలో కనిపిస్తుంది. మరణాల శాతం కూడా ఎక్కువగా ఉండును.

### నిరపాయమైన రకం :

- పొక్కులు చర్మం పైన వెంట్రుకలు లేని భాగాలలో స్పష్టంగా కనిపిస్తాయి.
- వ్యాధి తీవ్రత తక్కువగా ఉంటుంది.
- సాధారణంగా ఈ వ్యాధి రకం పెద్ద జీవాలలో ఎక్కువగా గమనించవచ్చు.
- ఆడ గొర్రెలలో పొదుగు మీద పొక్కులు వచ్చి చితికి పుండ్లుగా మారి పొదుగు వాపుకి కారణం అవుతుంది.

## నివారణ చర్యలు :

- గొర్రెలు మరియు మేకలలో ఆగస్టు నెల నుంచే వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి.
- వ్యాధి ప్రబలి ఉన్న ప్రాంతాల వైపు జీవాలను మేపుకు తీసుకెళ్లకూడదు.
- వ్యాధి నిరోధక శక్తి తల్లి నుండి పిల్లలకు సంక్రమించుటకు జున్నుపాలు త్రాగించాలి.
- తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని ఇవ్వాలి.
- చనిపోయిన జీవాలను ఊరికి దూరంగా గొయ్యి తీసి సున్నం వేసి పూడ్చి పెట్టాలి.
- జీవాలు చనిపోయిన ప్రదేశాన్ని మరియు మేత, నీటి తొట్టెలను క్రిమి సంహారక మందులతో శుభ్ర పరచుకోవాలి.

## చిటుక రోగం (గడ్డి రోగం):

ఈ వ్యాధి "క్లాస్ట్రీడియమ్ పర్ ఫ్రింజన్స్" అనే సూక్ష్మజీవి వలన కలుగుతుంది. ఈ సూక్ష్మజీవులు సాధారణంగా గొర్రెల ప్రేగులలో తక్కువ సంఖ్యలో ఉంటాయి. తొలకరి వర్షాలు కురిసిన పిమ్మట జూన్-జూలై నెలలో మొలచిన గడ్డి తినడం వలన లేదా ఎక్కువ దాణాను తినడం వలన సూక్ష్మజీవులు ప్రేగుల యందు ఎక్కువగా వృద్ధి చెంది "ఎప్సిలాన్" అనే విష పదార్థాన్ని విడుదల చేయడం వలన జీవాలకు ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సాధారణంగా లేత వయస్సు వాటికి, బలమైన ఆరోగ్యంగా అగుపించే వాటిల్లో మరియు ఎక్కువ మోతాదులో పచ్చగడ్డి మేయు వాటికీ వస్తుంది.

## వ్యాధి లక్షణాలు:

- సామాన్యంగా వ్యాధి లక్షణాలు కనబడకుండానే జీవాలు గాలిలోకి ఎగిరిపడి గిలగిలా కొట్టుకొని, పళ్ళు కొరుకుతూ బిగుసుకొని చనిపోతాయి. అందుకే దీనిని చిటుక రోగం అంటారు.
- వ్యాధి తీవ్రత తక్కువగా వున్న జీవాలకు 104° - 106° F జ్వరం ఉండి, గడ్డి తినడం మానేస్తాయి.
- పొట్ట భాగాన్ని కాళ్లతో కొట్టుకోవడం, తరచుగా క్రిందికి పైకి లేవటం మరియు ప్రక్కకి తిరిగి పడుకోవడం వంటి లక్షణాలను గమనించవచ్చు.
- కొన్నిసార్లు మొదట మలబద్ధకం ఏర్పడి. తరువాత మెత్తని పేడ వేయడం గమనించవచ్చు.

- మేత మేయవు, నెమరువేయవు. పళ్ళు కొరుకుతాయి.
- చురుకుదనంలేకుండా ఒక చోట నిలుస్తాయి.
- వంకర టింకరగా సోలిపోతూ పడుతూ లేస్తూ నడుస్తుంటాయి. కొన్ని జీవాలలో ఫిట్స్ లాంటి లక్షణాలు కనబడటం, గుండ్రంగా తిరగటం, నోటి నుండి నురగ రావటం, కుప్పకూలి పోవటం జరుగుతుంది.
- వ్యాధితో చనిపోయిన గొర్రెలలో మూత్రపిండాలు లావుగా మరియు మెత్తగా మారిపోతాయి.

**నివారణ :**

- వర్ష ఋతువుకు ముందు అనగా మే-జూన్ మాసములో మూడు నెలల వయస్సు నిండిన గొర్రె పిల్లలకు వ్యాధి రోగనిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి.
- టీకాలు వేయించే ముందు తప్పని సరిగా నట్టల నివారణ మందు త్రాగించాలి.

**నీలి నాలుక/ మూతి వాపు వ్యాధి:** ఈ వ్యాధి అతి సూక్ష్మజీవుల వలన వస్తుంది. ఈ వ్యాధి ఆగష్టు, సెప్టెంబర్ మరియు అక్టోబర్ మాసములో అతి వేగంగా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి ఎక్కువగా గొర్రెలలో చూడవచ్చు. ఈ వ్యాధి ఒక జీవం నుండి మరో జీవానికి "క్యూలికాయిడెస్" అనే దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుంది. వ్యాధికి కారణమైన వైరస్, క్యూలికాయిడెస్ దోమలోనికి వ్యాధిగ్రస్థ జీవాన్ని కుట్టినప్పుడు ప్రవేశిస్తుంది. వ్యాధికారక వైరస్ క్యూలికాయిడెస్ దోమ లోనికి ప్రవేశించిన 10 రోజుల తరువాత మరొక జీవాన్ని కుట్టినప్పుడు ఆ జీవంలో వ్యాధిని కలుగజేస్తుంది. అధిక వర్షపాతము వున్న సంవత్సరంలో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది.

**వ్యాధి లక్షణాలు:**

- క్యూలికాయిడెస్ దోమ జీవాన్ని కుట్టిన వారం రోజులలో వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి.
- శరీర ఉష్ణోగ్రత 104$^{0}$ నుండి 106$^{0}$ F వరకు చేరుకుంటుంది.
- చిగుళ్ళు, పెదవులు వాచి పెదవుల చివర ఎరుపు రంగు చేరుకొని, కొన్ని సందర్భములలో రక్తం కూడా కారుతుంది. అందువలన నాలుక వాచి నీలి రంగుకు మారుతుంది.
- నోటి నుండి చొంగ లేక నురుగ కారడాన్ని గమనించవచ్చు.

- నోటి లోపల భాగంలో పుండ్లు ఏర్పడి నీరు త్రాగలేకపోవడం మరియు మేత తినలేకపోవడం వలన జీవాలు నీరసించిపోతాయి.
- జీవాల కాలి గిట్టల మొదటి భాగంలో వాపు వచ్చి కుంటుతూ నడుస్తాయి.
- ముక్కు లోపలి  భాగం కూడా ఎర్రబడి, చీమిడి కారుతూ, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి.

**చికిత్స మరియు నివారణ :**

- వ్యాధి సోకిన జీవాలకు తేలికగా జీర్ణమగు, గంజి లాంటి ఆహారం ఇవ్వాలి.
- నోటి పుండ్లను శుభ్రంగా కడిగి డాక్టర్ సలహా మేరకు యాంటి బయోటిక్స్ ఇవ్వాలి.
- ఈగలు, దోమలు నివారించడానికి ప్రతీ 10  రోజులకొకసారి షెడ్డు లోపల, బయట మాలాథియాన్ వంటి క్రిమిసంహారక మందులను పిచికారి చేయాలి. షెడ్డు పొడిగా ఉండాలి.
- గొర్రెలను తేమ లేని ఎత్తైన ప్రదేశాలలో ఉంచాలి. రాత్రి పూట షెడ్డు లో వేపాకు పొగ వేయాలి.
- వ్యాధి సోకిన జీవాలను మంద నుండి వేరు చేసి నోటిని పొటాషియం పర్మాంగనేట్ లోషను తో కడిగి, బోరోగ్లిజరిన్ పూయాలి.
- వరి నూకలు లేక రాగుల జావలో గ్లూకోజ్ పొడి మరియు కొంచెం ఉప్పు కలిపి జాగ్రత్తగా త్రాగించాలి.

**గొంతువాపు వ్యాధి :** ఈ వ్యాధి పాశ్చురెల్లా మల్టోసిడా అనే బాక్టీరియా వలన వస్తుంది. త్రాగు నీరు, కలుషిత వాతావరణం, అనారోగ్య పశువుల స్పర్శ, కలుశితమైన గాలి, మేత మరియు పరికరాల ద్వారా ఈ వ్యాధి వేగంగా వ్యాపిస్తుంది. ముఖ్యంగా వరదల తర్వాత నిలిచిపోయిన మురుగునీటిలో, అపరిశుభ్రమైన పశువుల పాకలు, వాటి పరిసరాలు ఈ వ్యాధి వ్యాప్తికి కారకమౌతాయి.

**వ్యాధి లక్షణాలు :**

- ఈ వ్యాధి సోకిన జీవాలలో ఎక్కువగా జ్వరం ఉండి, ఆకలి లేకపోవడం
- గొంతు దగ్గర, మెడ క్రింద, ఛాతి దగ్గర వాపు వస్తుంది.
- ఊపిరి పీల్చటం కష్టంగా ఉంటుంది. ఊపిరితిత్తులు పాడై జీవాలు చనిపోతాయి.

## చికిత్స మరియు నివారణ

- వ్యాధి సోకిన జీవాలను వేరు చేసి పశువైద్యునిచే చికిత్స చేయించాలి.
- ఈ వ్యాధికి సల్ఫాడిమిడిన్ యాంటిబయోటిక్ మందులను మరియు నొప్పి నివారణ మందులను వాడాలి.
- వ్యాధి నివారణ కోసం జూన్-జూలై నెలలలో గొంతు వాపు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.
- పరిశుభ్రత పాటించడం, కలుషిత మైన నీరు, ఆహారం ఇవ్వకుండా ఉండటం.

## మూతి పుండ్ల వ్యాధి:

ఈ వ్యాధి పారా పాక్స్ వైరస్ వలన సంభవిస్తుంది. ఈ సుక్ష్మాతి సూక్ష్మజీవులు చర్మపు పొక్కులలో ఉండి పెదవుల పైన మరియు నోటి యందు గాయాలైనప్పుడు శరీరంలోకి ప్రవేశిస్తుంది.

## వ్యాధి లక్షణాలు :

- ముఖ్యంగా ఈ పొక్కులు పెదవులపైన మరియు ముఖం పైన ఎక్కువగా కనిపిస్తాయి.
- పొక్కులు పెదవులంతా వ్యాపించి ఆహారం తీసుకొనుటకు కష్టమవుతుంది.
- ఈ వ్యాధి ఎక్కువగా 4 నుండి 5 మాసాల గొర్రె /మేక పిల్లలలో సోకుతుంది. పెద్ద గొర్రెలలో అంతగా వ్యాపించదు.

## చికిత్స :

- మూతి పుండ్లను పెర్మంగనేట్ ద్రావణంతో శుభ్రము చేయాలి.
- డాక్టర్ సలహాతో యాంటిబయోటిక్ మందులను వాడాలి.
- తేలికగా జీర్ణమయ్యే గంజి త్రాగించాలి.

## కాలి పుండ్ల వ్యాధి/మితువ కాళ్ళు/పొగాళ్ళు:

ఈ వ్యాధి “ఫ్యుజో బాక్టీరియా నెక్రోఫోరం” మరియు “డైఖిలో బాక్టర్ నోడాసస్” అనే సూక్ష్మక్రిముల వలన వస్తుంది. ఈ వ్యాధి ఎక్కువగా వర్షాకాలంలో కాళ్ళ గిట్టలు ఎక్కువ సేపు నీటిలో, బురదలో నానుట వలన గిట్టలు మెత్తబడి వ్యాధికారక సూక్ష్మక్రిములు గిట్టల్లోకి ప్రవేశించి వ్యాధిని కలుగచేస్తాయి. పెరిగిన గిట్టలను తరచుగా కత్తిరించకపోవడం వలన లేదా జీవాలకు తగినంత స్థలం లేకపోవడం

వలన కూడా ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంటుంది. వ్యాధిసోకి కోలుకున్న 5-10 శాతం జీవాలు దీర్ఘకాలిక వాహకాలుగా మారి, మిగతా జీవాలకు ఈ వ్యాధిని వ్యాపింపజేస్తాయి.

**వ్యాధి లక్షణాలు:**

- వ్యాధి సోకిన జీవాలలో రెండు గిట్టల మధ్య చర్మం ఉబ్బి, ఎర్రగా వాచి, మెత్తబడి జీవాలు కుంటుతాయి. క్రమంగా కాళ్ళ క్రింద భాగం అంతా పాడై గిట్టలు మాత్రమే తేలుతాయి. చెడు వాసనతో చీము కారుతుంది. ఈ స్థితిలో ఒక కాలు లేపి కాని లేదా మోకాళ్ళపై కాని నడుస్తాయి. లేదా నడవలేని స్థితిలో ఉంటాయి. బాగా పాడైపోయిన గిట్టలు ఊడిపోతాయి.
- కాలి గిట్టల మధ్య నొప్పి వలన సరిగ్గా నడవలేకపోయి, మేత సరిగ్గా తినలేకపోవడం వలన బరువు తగ్గి నీరసంగా ఉంటాయి.
- ఈ వ్యాధికి పర్యవసానంగా చికిత్స మరియు నివారణ ఖర్చులు పెరుగుతాయి మరియు కొన్ని సందర్భాలలో జీవాలను తక్కువ ధరకి అమ్మవలసి వచ్చి రైతుకి చాలా నష్టం వాటిల్లుతుంది.

**నివారణ :**

- వ్యాధి సోకిన జీవాలను వేరు చేసి చికిత్స చేయించాలి.
- యాంటి బయోటిక్ సూదులు వరుసగా మూడు రోజులు ఇవ్వాలి.
- పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంలో రోజూకాళ్ళను శుభ్రంగా కడగాలి.
- జీవాలను వర్షాకాలంలో చిత్తడి నేలలో ఎక్కువసేపు ఉంచరాదు.
- పెరిగిన గిట్టలను సకాలంలో కత్తిరించుకోవడం మరియు జీవాలకు సరిపడినంత స్థలాన్ని కేటాయించాలి.
- జీవాలను కొనేటప్పుడు చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకొని కొనాలి. క్రొత్తగా కొన్న జీవాలను 30 రోజులు వేరుగా ఉంచి గిట్టలను పరిశీలించి మందలో కలుపుకోవాలి.

**దొమ్మ రోగం/నేరుడు వాపు/నల్ల జాడ్యం:**

ఈ వ్యాధి "బ్యాసిల్లస్ ఆంత్రాసిస్" అనే సూక్ష్మ జీవి వలన కలుగును. ఈ సూక్ష్మ జీవి పశువు శరీరం నుండి వాతావరణం లోకి రాగానే బీజంశాలు (స్పోర్స్) గా

మారి భూమిలో 40-50 సంవత్సరాలు జీవించి ఉంటాయి. ఈ స్పోర్స్ కలిసిన నీరు త్రాగుట వలన మరియు మేత తినుట వలన గొర్రెలలో ఈ వ్యాధిని గమనించవచ్చు. ఈ వ్యాధి పశువుల నుండి మనుషులకు కూడా సోకే అవకాశం ఉంది.

### వ్యాధి లక్షణాలు:

- వ్యాధి తీవ్రత ఎక్కువగా లేని గొర్రెలలో జ్వరం ఉంటుంది.
- శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది.
- సరిగ్గా తినలేకపోవడం మరియు నెమరు వేయకపోవడం గమనించవచ్చు.
- సాధారణంగా లక్షణాలు కనపడకుండానే, జీవాల ముక్కు, నోరు మరియు ఇతర జననేంద్రియ రంధ్రాల ద్వారా పల్చటి రక్తం కారి చనిపోతాయి. రక్తం గడ్డ కట్టకుండా ఉంటుంది.

### నివారణ చర్యలు :

- వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే పశు వైద్యుని సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.
- గొర్రెలు చనిపోయినట్లయితే ఎట్టి పరిస్థితులలోను కోయరాదు మరియు ఆరు బయట ప్రదేశాల్లో వేయకూడదు.
- చనిపోయిన గొర్రెలను లోతైన గుంటతీసి, పూడ్చి పైన ఫార్మలిన్ ద్రావణంను చల్లాలి, తరువాత సున్నం చల్లి మట్టితో పూడ్చి పెట్టాలి.
- వ్యాధిగ్రస్థ జీవాలు ఉన్న ప్రాంతాన్ని క్రిమిసంహారక మందులతో శుభ్ర పరచుకోవాలి.
- వ్యాధి ఉన్న ప్రాంతంలో సంవత్సరానికి ఒకసారి వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలి.

### గొర్రె/ మేక పిల్లల్లో రక్త పారుడు లేదా కాక్సిడియోసిస్ :

గొర్రె పిల్లల్లో ముఖ్యంగా వర్ష కాలంలో రక్తపారుడు ఎక్కువగా వచ్చే ఆస్కారం ఉంది. పాక అపరిశుభ్రంగా ఉండటం, గాలి వెలుతురు సరిగా లేకుండా ఉండడం లాంటి కారణాల వలన ఈ వ్యాధి కారక కాక్సిడియా అను ఏకకణజీవులు అధికంగా అభివృద్ధి చెందుతాయి. మన రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో గొర్రె పిల్లలను తల్లి నుండి వేరుచేసి గంప క్రింద కప్పటం అలవాటు. అలా చేసిన ఎడల అక్కడి ప్రదేశం చిత్తడిగా, చీకటిగా మరియు గాలి ప్రసరించకుండా ఉండటంవలన కూడా వ్యాధి కారక క్రిములు అధిక సంఖ్యలో వృద్ధి చెందుతాయి.

**లక్షణాలు:** రక్తంతో కూడిన పారుదు, ఆకలి లేక ఆహారం తీసుకొనక పోవడం వలన గొర్రె పిల్లలు నీరసించి 2-4 వారాల్లో చనిపోవటం జరుగుతుంది.

**చికిత్స మరియు నివారణ :**

- పశు వైద్యుని సలహా మేరకు వ్యాధిగ్రస్థ గొర్రె/ మేక పిల్లలకు ఆంప్రాలియం లేదా నైట్రోఫురజోన్ లేదా సల్ఫాడిమిడిన్ మందులను ఇవ్వాలి.
- పాకను చిత్తడి లేకుండా పొడిగా ఉంచాలి.
- గాలి, వెలుతురు ధారాళంగా ప్రసరించేలా చూడాలి.

## గొర్రెలు మరియు మేకలలో అంతరపరాన్న జీవుల ప్రభావం

ఇతర జాతుల పశువు కంటే గొర్రెలలో అంతరపరాన్న జీవులు అంటే నట్టలు అధికంగా ఉంటాయి. ఇవి జీవాలకు ప్రథమ శత్రువులు. వీటి వలన గొర్రెలు తమ శరీర పటుత్వం కోల్పోయి, బలహీనపడుతాయి. తద్వారా ఉత్పత్తి కోల్పోవటమే కాకుండా రోగనిరోధక శక్తిని కూడా కోల్పోయి చనిపోతుంటాయి. వర్షాకాలంలో గొర్రెలను ఆశించే ఈ అంతరపరాన్న జీవులలో ముఖ్యమైనవి ఏమిటంటే,

**కార్జపు జలగ వ్యాధి:** దీనిని జలగ రోగం అని కూడా అంటారు. ఈ వ్యాధి “ఫేసియోలా హెపాటికా” మరియు “ఫేసియోలా జేగాంటిక” అను జలగ వలన కలుగుతుంది. ఈ జలగలు కాలేయాన్ని ఆశిస్తాయి. అందుకని ఈ వ్యాధిని కార్జపు జలగవ్యాధి అని అంటారు. గొర్రెలు మరియు మేకలు నీరు నిలిచి ఉన్న పచ్చిక బయళ్ళలో, వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో మేసినప్పుడు లేదా నీరు త్రాగినప్పుడు ఈ వ్యాధి వ్యాపిస్తుంది. జీవాలు నీరు నిల్వ ప్రాంతాలలో మేసినప్పుడు ఆ ప్రాంతాలలో ఉండు నత్తలలో పరాన్నజీవి వృద్ధి చెంది, వాటి నుండి నీళ్ళలోకి విడుదల అవుతాయి. నీళ్లలో ఈదుతున్న సర్కేరియా లార్వాలు గడ్డి పరకలను ఆశించి మెటా సర్కేరియాగా మార్పు చెంది గొర్రెలలోకి మేత/నీరు ద్వారా ప్రవేశిస్తాయి. జీవాలలోకి చేరిన మెటా సర్కేరియా లార్వాలు, ప్రేగు గోడలలో నుంచి పాకుతూ ఉదర కుహరాన్ని చేరుకొని అక్కడ నుంచి కాలేయాన్ని చేరుకొని వ్యాధిని కలుగజేస్తాయి.

**వ్యాధి లక్షణాలు :** ఈ వ్యాధి రెండు రకాలుగా కనబడుతుంది.

1. తీవ్ర వ్యాధి : ఈ రూపంలో జీవాలు ఆకస్మిక మరణాలకు గురవుతాయి. ఈ రూపంలో జలగలు కాలేయాన్ని పూర్తిగా విధ్వంసం చేయడం వలన మరణాలు సంభవిస్తాయి.
2. దీర్ఘకాలిక వ్యాధి : ఈ రూపంలో క్రమేణా బరువు తగ్గి జీవాలు రక్తహీనతకు లోనవుతాయి. రక్తహీనత వలన క్రింది దవడలో నీరు చేరి దవడ వాచి ఉంటుంది. పేడ పలుచగా వేస్తాయి. కాలేయం చెడిపోవటం వలన పచ్చ కామెర్లు వచ్చి జీవాలు క్రమంగా నీరసిస్తాయి.

**పొట్ట జలగ వ్యాధి:** ఈ వ్యాధి పారంఫిస్టోమ్ అనే పొట్ట జలగల వలన కలుగుతుంది. ఈ వ్యాధి నీరసంగా, శక్తి తక్కువగా ఉన్న గొర్రె/మేక పిల్లలలో ఎక్కువగా కలుగుతుంది. పొట్ట జలగల లార్వాలు చిన్న ప్రేగులకు అతుక్కుని ఉండి, రాపిడి కలిగించడం వలన నీళ్ళ విరోచనాలు అవుతాయి.

ఈ వ్యాధిలో రెండు రకాల లక్షణాలు గమనించవచ్చు.

1. తీవ్ర వ్యాధి : చెడు వాసన కలిగిన విపరీతమైన నీళ్ళ విరోచనాలు, మేత తినలేకపోవుట, తీవ్ర రక్త హీనత, పొట్ట క్రింద మరియు దవడ క్రింద నీరు పట్టి ఉబ్బటం, చనిపోవటం జరుగుతుంది.
2. దీర్ఘకాలిక వ్యాధి : వ్యాధి లక్షణాలు పెద్దగా కనిపించవు. మేత మేసినా క్రమేణా నీరసించిపోతుంటాయి. రక్తహీనతతో బలహీనంగా ఉంటాయి.

**హిమాంకోసిస్ వ్యాధి:** ఈ వ్యాధి గొర్రెలు మరియు మేకలలో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ వ్యాధి కారక జీవులు పొట్ట నందుండి రక్తమును పీల్చుకొనుట ద్వారా రక్తహీనతను కలుగజేస్తాయి. ఈ పరాన్నజీవుల గ్రుడ్లు పేడ ద్వారా నేల పైకి చేరి తిరిగి కలుషితమైన నీరు, ఆహారము ద్వారా శరీరంలోనికి ప్రవేశిస్తాయి. గొర్రె/మేక పిల్లలలో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది.

**వ్యాధి లక్షణాలు :**

- పరాన్నజీవులు కడుపు నందు ఎక్కువగా ఉన్నపుడు గొర్రె/మేక పిల్లలు ఎటువంటి లక్షణములు చూపించకుండా చనిపోతాయి.

• కంటి లోపల పొర పాలిపోయి ఉంటుంది.
• దవడ క్రింద నీరు చేరుతుంది.
• ఆకలి మందగించి నీరసంగా ఉంటాయి. క్రమేపి బరువు కోల్పోతాయి.

**నివారణ :** నట్టలు జీవాల శరీరంలోనికి ప్రవేశించి అధిక సంఖ్యలో వృద్ధి చెందక ముందే వాటి నివారణ చర్యలు చేపట్టుట చాలా మంచిది. నట్టలు వర్ష ఋతువులో పచ్చిక బయళ్ళు ఉండే సమయములో అధిక సంఖ్యలో వృద్ధి చెందుతాయి. కావున వర్ష ఋతువుకు ముందు, మధ్య వర్షాకాలంలో మరియు వర్ష ఋతువు ముగిసిన పిమ్మట జీవాలకు తప్పనిసరిగా నట్టల మందులు త్రాగించి వాటి నివారణ చేయుట ఎంతయినా అవసరం. మిగతా సమయాలలో జీవాల పేడను పరీక్ష చేయించి నట్టల రకాలను బట్టి షెడ్డు లోని పైమట్టిని ప్రతీ ఆరు నెలలకు ఒకసారి తీసి, క్రొత్త మట్టిని వేయాలి. సున్నం నేలపైన చల్లాలి. నీరు నిలువ ఉండే ప్రదేశాలలో, నట్టలు ఉన్న ప్రదేశాలలో జీవాలను మేపరాదు. నట్టలు ఉన్నచోట కాపర్ సల్ఫేట్ మందును నీటిలో కలపాలి.

## గొర్రెలు మరియు మేకలలో వ్యాధి నిరోధక టీకాల పట్టిక

| వ.సం. | టీకా | ఇవ్వవలసిన సమయం |
|---|---|---|
| 1. | దొమ్మ రోగం | సంవత్సరానికి ఒక్కసారి వ్యాధి సోకిన ప్రాంతాల్లో ఉండే పశువులకు ఈ టీకా వేయించాలి. |
| 2. | గొంతువాపు వ్యాధి | తొలకరి వర్షాల ముందు |
| 3. | చిటుకు వ్యాధి | మొదటి టీకా మే నెలలో మరియు బూస్టర్ టీకా మొదటి టీకా వేసిన 15 రోజుల తర్వాత తప్పని సరిగా వేయించాలి |
| 4. | జబ్బవాపు వ్యాధి | తొలకరి వర్షాల ముందు |
| 5. | పారుడు వ్యాధి (పి.పి.ఆర్) | మూడు సంవత్సరాలకు ఒకసారి వేయించాలి |
| 6. | గాలికుంటు వ్యాధి | సెప్టెంబర్ మరియు మార్చి మాసాల్లో వేయించాలి. |
| 7. | మశూచి /అమ్మ తల్లి | డిసెంబర్ మాసంలో వేయించాలి. |
| 8. | శ్వాస కోశ వ్యాధి (C.C.P.P) | జనవరి మాసంలో వేయించాలి. |

పైన పేర్కొన్న విధంగా జీవాల పెంపకదార్లు తగిన జాగ్రత్తలు వహించినట్లయితే, జీవాలలో మరణాల రేట్లు తగ్గటమేకాకుండా, తగిన పెరుగుదల వుండి తద్వారా చక్కటి లాభాలను పొందవచ్చు.



జలగ వ్యాధి బారిన పడిన జీవాలలో కాలేయం మరియు
పెద్ద పొట్టను ఆశించిన జలగలు



జలగ వ్యాధి బారిన పడిన జీవాలలో రక్తహీనత వలన క్రింది దవడలో నీరి చేరి దవడ వాచి ఉండటం
మరియు పాలిపోయిన కనురెప్ప పొరలు






Dr. Y.S.R. Horticultural University

**KRISHI VIGNANA KENDRA**

Kadapa-2 (Vonipenta), Mydukur (Mandal), Y.S.R. Kadapa District, Andhra Pradesh - 516173.

भाकृअनुप-कृषि तकनीकी अनुप्रयोग अनुसंधान संस्थान (अटारी)

ICAR-Agricultural Technology Application Research Institute (ATARI)

Zone-X/क्षेत्र 10, क्रीडा परिसर CRIDA Campus, संतोषनगर/Santoshnagar, हैदराबाद/Hyderabad - 500059

An ISO 9001:2015 Certified Institute